విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

## పదో తరగతి బాలికలందరికీ సైకిళ్లు అందిస్తాం

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

కలెక్టరేట్/విద్యానగర్, మార్చి 15: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతూ సైకిల్ అవసరం ఉన్న బాలికలు అందరికీ వచ్చే విద్యాసంవత్సరంలో సైకిళ్లను అందిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్‌లోని టీఎన్జీవో ఫంక్షన్ హాల్లో శనివారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో ద్వారా వందమంది ప్రభుత్వ పాఠశాల బాలికలకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టగా, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాజరయ్యారు. బాలికలకు సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాలికల హాస్టల్‌లో వాషింగ్ మిషన్ వంటి ఉపకరణాలు అందిస్తామన్నారు. రాష్ట్రంలో చిన్న పిల్లల ద్వారా డ్రగ్స్‌ను విక్రయిస్తూ దందా కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దందాపై ఉక్కు పాదం మోపాలని పోలీసులను కోరారు. అంతకుముందు ఇక్కడ పలు శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడారు. ఈ సందర్భంగా బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ శోభారాణి, జిల్లా సంక్షేమ అధికారి సబిత, ఎస్బీఐ ఏజీఎం ఎస్.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఆసీఫ్‌నగర్ పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కొత్తపల్లి/విద్యానగర్, మార్చి 15 : విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఇందుకోసం పాఠశాల విద్యాశాఖ చేపట్టిన ఏఎక్స్ఎల్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం కొత్తపల్లి మండలం ఆసీఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలు కంప్యూటర్లోకి లాగిన్ అయి వ్యాఖ్యాలు చదువుతూ వివిధ లెవల్స్ పూర్తి చేయడాన్ని కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఒకే చోట ఉన్న జిల్లాలోని 18 స్కూళ్లను కంప్యూటర్ ల్యాబ్‌ల ప్రారంభానికి ఎంపిక చేశామని తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, గణితంలో వెనుకబడిన విద్యార్థులకు ఈ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అందులో ఉన్న విషయ పరిజ్ఞానం వల్ల విద్యార్థులకు చక్కటి అవగాహన వస్తుందని తెలిపారు. తక్కువ సమయంలో ప్రాక్టికల్‌గా విద్యార్థులు విషయాన్ని నేర్చుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఏఐ టెక్నాలజీ ద్వారా విద్యార్థుల పరిజ్ఞానాన్ని అంచనా వేసి సాఫ్ట్‌వేర్ బోధన అంశాలను నేర్పుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు, తహసీల్దార్ రాజేశ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి ఆనందం, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ కృష్ణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసీఫ్‌నగర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో ఏఎక్స్ఎల్ కార్యక్రమాన్ని ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్

### విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

తిమ్మాపూర్ రూరల్, మార్చి 15: ప్రతి విద్యార్థి సబ్జెక్టులోని విషయాన్ని అర్థం చేసుకుని, అవగాహన పెంచుకొని చదవాలని, అప్పుడే మంచి ఫలితాలు సాధిస్తారని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రం సీఈవో అలుగునూర్‌లో శనివారం రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం ద్వారా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపం ఉన్న 72 మంది విద్యార్థులను గుర్తించి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాలలోని వసతులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి షాజిత , డిప్యూటీ డీఎంహెచ్‌వో సుజాత, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ సనా, వైద్యాధికారులు, గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ప్రజల పక్షాన మాట్లాడడం తప్పా

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం సిగ్గుచేటు
- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్

రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్ టౌన్, మార్చి 15: మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రజల పక్షాన మాట్లాడడమే ఆయన చేసిన తప్పా అని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ప్రశ్నించారు. ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు సరిగా లేవని, ప్రజలకు ఇచ్చిన హామీలపై నిలదీస్తే సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి సస్పెన్షన్‌పై శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపేసిందన్నారు. కాంట్రాక్టర్ల కమిషన్ల కోసమే ప్రభుత్వం పని చేస్తున్నదని, పేద ప్రజల బాగోగులు అవసరం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 15 నెలలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రం అమలు కావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తెలంగాణ ప్రజలు అసహనంగా ఉన్నారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఇక రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని ఎండగడతామన్నారు. ప్రజల తరఫున మాట్లాడిన జగదీశ్ రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మండలాధ్యక్షుడు ఐలయ్య, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, ఉమామహేశ్వర్, కేసిరెడ్డి లావణ్య, ముక్క రమేశ్, కుమార్, నాయకులు ఇమ్రాన్, కొండపాక శ్రీనివాస్, తులసీ లక్ష్మణమూర్తి, కక్కెర్ల సారయ్య, రాజు పాల్గొన్నారు.

### ఏసీపీ కార్యాలయంలో సీపీ తనిఖీ

హుజూరాబాద్ టౌన్, మార్చి 15: పట్టణంలోని కేసీ క్యాంపులో గల హుజూరాబాద్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి, కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా వాటిని పూర్తి చేయాలని సూచించారు. గంజాయి రవాణా, ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం తరలింపు, పేకాడే వారిని గుర్తించి, కేసులు నమోదు చేసి, ఉక్కుపాదం మోపాలన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ, టౌన్ సీఐ జీ తిరుమల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

హుజూరాబాద్ టౌన్, మార్చి 15: హుజూరాబాద్ పురపాలక సంఘం 2025-26 వార్షిక సంవత్సరానికి గాను రూ. 14,24,60,000 బడ్జెట్ ప్రతిపాదనలను పంపగా మున్సిపల్ ప్రత్యేకాధికారి ప్రఫుల్ దేశాయ్ శనివారం కరీంనగర్‌లోని తన కార్యాలయంలో బడ్జెట్‌ను ఆమోదించారు. సాధారణ నిధులకు రూ. 9,33,59,000, ప్లాన్, నాన్ ప్లాన్, ఇతర నిధుల కోసం రూ. 4,91,00,000 బడ్జెట్‌ను కేటాయించారు. మున్సిపల్ కమిషనర్ కే సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కొత్తపల్లి, మార్చి15 : వెదిర గ్రామానికి చెందిన మల్యాల సత్తయ్య (55) అనే వ్యక్తి శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల సత్తయ్య తన ద్విచక్రవాహనంపై కరీంనగర్ వెళ్తుండగా రెడ్డిరామయ్యపల్లె స్టేజీ వద్ద ఎదురుగా వచ్చిన కొత్తపల్లికి చెందిన శ్రీపతి నవీన్ బైక్ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మరణించాడు. సత్తయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కారు ఢీకొని..**

కొత్తపల్లి, మార్చి 15 : రేకుర్తి గ్రామానికి చెందిన అక్కపెళ్లి భూమయ్య (48) శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రేకుర్తికి చెందిన అక్కపెళ్లి భూమయ్య తన టీవీఎస్ ఎక్స్ఎల్‌పై కూలి పనికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా కొత్తపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద జగిత్యాల రోడ్డు నుంచి కరీంనగర్ వైపు వస్తున్న కియా కారు వెనుకనుంచి ఢీకొన్నది. దీంతో కాలు, చేయి, తలకి తీవ్రమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య అక్కపెళ్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**రైలు ఎక్కబోతూ జారిపడి..**

జమ్మికుంట, మార్చి15: జమ్మికుంట రైల్వే స్టేషన్లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కబోతూ ప్రమాదవశాత్తు జారిపడి కొమురయ్య అనే రైల్వే ఉద్యోగి మృతి చెందాడు. మృతుడి స్వగ్రామం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం సోమిడి గ్రామం. మృతుడు బిజిగిరి షరీఫ్ రైల్వే స్టేషన్ పరిధిలో గ్యాంగ్ మెన్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో బిజిగిరి రైల్వే స్టేషన్లో రైలు సౌకర్యం లేక జమ్మికుంటలో రైలు ఎక్కేందుకు వచ్చాడు. దానాపూర్ జనరల్ భోగిలో ఎక్కే క్రమంలో కాలు జారీ ప్లాట్ ఫామ్‌పై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కాజీపేట రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆలయాలకు విరాళం

గంగాధర, మార్చి 15: గర్శకుర్తి గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.20 వేలు, గ్రామంలో నూతనంగా చేపట్టిన బీరప్ప ఆలయ నిర్మాణానికి రూ.10 వేల విరాళాన్ని నాయకుడు తూడి లచ్చయ్య ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే, మల్లాపూర్ గ్రామానికి చెందిన మొగులోజి బాలయ్య అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు.

కరీంనగర్ జట్టుతో సర్దార్ సురేందర్ సింగ్, తదితరులు

## రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఏర్పాట్లు పూర్తి

హుజూరాబాద్ టౌన్, మార్చి 15: పట్టణంలోని ఉన్నత పాఠశాల మైదానంలో నేటి నుంచి జరిగే ఎనిమిదో సీనియర్ రాష్ట్రస్థాయి మెన్ హాకీ చాంపియన్ షిప్ పోటీలకు హుజూరాబాద్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం జిల్లా అసోసియేషన్ సెక్రటరీ సర్దార్ సురేందర్ సింగ్ జెర్సీలు ఆవిష్కరించి, కరీంనగర్ జట్టు సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి, టోర్నమెంట్ విజేతగా నిలవాలని సర్దార్ సురేందర్ సింగ్ క్రీడాకారులకు సూచించారు. 16, 17, 18, తేదీల్లో జరిగే హాకీ టోర్నమెంట్‌కు రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొంటున్నట్లు హుజూరాబాద్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట రాజేంద్రప్రసాద్, హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో హాకీ క్లబ్ అసోసియేషన్ స్టేట్ జాయింట్ సెక్రటరీ కళ్యాణి సర్దార్, కరీంనగర్ జిల్లా హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, హుజూరాబాద్ హాకీ క్లబ్ సెక్రటరీ గంగిశెట్టి ఉమామహేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ యేముల రవికుమార్, సీనియర్ క్రీడాకారులు లక్ష్మీనారాయణ, గుడ్డేలుగుల సమ్మయ్య, చింత శ్రీనివాస్, మౌటం రవీందర్, భూసారపు శంకర్, తాళ్లపెల్లి శ్రీనివాస్, సాయి కృష్ణ, రాజేశ్, తిరుపతి, శ్యామ్, విక్రమ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాన్షీరాం జయంతి వేడుకలు

చొప్పదండి పట్టణంలో కాన్షీరాం జయంతి వేడుకలను నిర్వహిస్తున్న అంబేద్కర్ సంఘ నాయకులు

చొప్పదండి, మార్చి15: పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం పట్టణాధ్యక్షుడు పెద్దెల్లి శ్రీనివాస్, మండలాధ్యక్షుడు కడారి గంగరాజు ఆధ్వర్యంలో శనివారం కాన్షీరామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు మహేశ్ కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ నాయకులు గంగరాజు, అరవింద్, రాజలింగం, స్వామి, వెంకటస్వామి, కనకయ్య, బసవన్న, నరసన్న, మొగిలి, రాజయ్య, శివ, శేఖర్, రాజయ్య, సాగర్, ఆనంద్, శ్రీనివాస్, అనిల్, హరీశ్, మల్లేశం, లచ్చయ్య, రజాక్, రామారావు, అశోక్, రిషి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్, మార్చి 15: పట్టణ శివారు సిర్సపల్లి క్రాస్ రోడ్డు వద్ద కాన్షీరాం జయంతి వేడుకలు ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. అలాగే, ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా జరిపారు. పార్టీ మండల కన్వీనర్ మంద రాజ్ మహారాజ్, బీఎస్పీ నాయకులు కండె తిరుపతి, సందెల వెంకన్న, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### యూనిక్ పోల్ నంబర్‌తో సులభంగా లైన్ల నిర్వహణ

ముకరంపుర, మార్చి 15: యూనిక్ పోల్ నంబర్ ద్వారా 33కేవీ, 11కేవీ లైన్ల నిర్వహణ సులభంగా చేపట్టవచ్చని కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేశ్ బాబు పేర్కొన్నారు. అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో భాగంగా 33కేవీ, 11కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్ ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 33కేవీ పోల్ నంబర్లు 56, 11కేవీ 178 స్తంభాలకు నంబరింగ్ పూర్తయినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే పోల్ నంబర్‌తో లొకేషన్ మ్యాపింగ్ తెలుసుకొని సత్వరమే ఆ ప్రాంతానికి వెళ్లి త్వరిత గతిన పరిష్కరిస్తారని తెలిపారు. దీంతో సరఫరాలో అంతరాయం సమయాన్ని గణనీయంగా తగ్గిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

### ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులో పేరు నమోదు చేసుకోవాలి

కమాన్‌చౌరస్తా, మార్చి 15 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో చదివి 2024 సంవత్సరంలో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు తమ విద్యార్హతతో కరీంనగర్ జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో తమ పేరు నమోదు చేసుకుని, ఎంప్లాయ్‌మెంట్ కార్డు పొందాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి వై తిరుపతి రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం ఆధార్ కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్లు, కులం, ఎస్ఎస్‌సీ మెమో, ఐటీఐ పాస్ మెమో, ఒరిజినల్‌తో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7207659969, 9908230384 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### అంగన్‌వాడీ కేంద్రాలు ఒంటిపూట నిర్వహణ

కలెక్టరేట్, మార్చి 15: జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు ఒంటిపూట నిర్వహించనున్నారు. ఈ మేరకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. మార్చిలోనే ఎండలు మండుతున్న నేపథ్యంలో బి ఆర్ టి యు అనుబంధ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ యూనియన్ విజ్ఞప్తి మేరకు, ఈ నెలాఖరు వరకు ఒంటిపూట మాత్రమే నిర్వహించాలని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశిస్తూ, సర్క్యులర్ విడుదల చేశారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే అంగన్వాడీ సెంటర్లు నిర్వహించాలని, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ విడుదల చేసిన సర్క్యులర్లో పేర్కొన్నారు.

## ఎట్టకేలకు ఇంటికి చేరుకున్న మధుకర్ రెడ్డి

పోలీస్ స్టేషన్ వద్ద కొక్కిరాల మధుకర్ రెడ్డి

మానకొండూర్ రూరల్, మార్చి 15: విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసగాళ్లు వేసిన ఎరకు చిక్కి నరకయాతనపడిన మధుకర్ రెడ్డి ఎట్టకేలకు స్వగ్రామం చేరుకున్నాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మానకొండూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన కొక్కిరాల రజిత-లక్ష్మారెడ్డి దంపతుల కుమారుడు మధుకర్ రెడ్డి డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా థాయ్‌లాండ్‌కు వెళ్లాడు. అప్పటికే సైబర్ కేటుగాళ్ల చేతిలో పడిపోయాడు. వారు సైబర్ ఫ్రాడ్స్ పనిలోకి దింపి, పాస్‌పోర్టును సైతం తీసుకున్నారు. ఈ విషయం వార్తా కథనాల ద్వారా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి వెళ్లడంతో వెంటనే మయన్మార్, కాంబోడియా దేశాల ప్రభుత్వ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపారు. ఆ దేశాల్లోని సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి చిత్రహింసలు అనుభవిస్తున్న వారిని వెనక్కి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ జోక్యంతో మధుకర్ రెడ్డి ఇండియాకు చేరుకున్నారు. శనివారం మానకొండూర్ మండల రంగపేట స్వగ్రామానికి వచ్చాడు. కుటుంబ సభ్యులతో కొంత సమయం గడిపి, మానకొండూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి, అక్కడి పరిస్థితులను పోలీసులకు వివరించారు.

### 18న దళిత సంఘాల సమావేశం

తెలంగాణచౌక్, మార్చి 15: బాబూ జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహనీయుల జయంతి వేడుకలను పురస్కరించుకొని జయంత్యుత్సవ కమిటీలను నియమించడం కోసం ఈ నెల 18న ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నిర్వహిస్తున్న దళిత సంఘాల సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 5న బాబూ జగ్జీవన్ రామ్, 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం కోసం కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దళిత సంఘాల నాయకులు మేధావులు విద్యావంతులు యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

గంగాధర : దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్

గంగాధర, మార్చి 15: సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణ చేసిన అనంతరమే ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోవడంతో 70 ఏళ్లుగా ఉద్యోగ నియామకాల్లో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదన్నారు. దేశ అత్యున్నత ధర్మాసనం ఎస్సీ వర్గీకరణను బలపరుస్తూ తీర్పు ఇచ్చిన తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేయాలని ప్రయత్నించడం దారుణమన్నారు. వెంటనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో చిలుముల రాజయ్య, గంగాధర రవి, దోమకొండ శ్రీనివాస్, ద్యావ శ్రీనివాస్, ద్యావ సంజీవ్, మంద రవీందర్, దోమకొండ మల్లయ్య, గంగాధర శంకర్, గంగాధర రఘు, లింగాల లింగయ్య, గంగాధర కొమురయ్య, గంగాధర మల్లేశం, తోడేటి శారద పాల్గొన్నారు.

వీణవంక, మార్చి 15: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష ఐదో రోజు కొనసాగగా, శనివారం ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు దీక్షలు కొనసాగుతాయని ఈ సందర్భంగా ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి అంబాల మధునయ్య స్పష్టం చేశారు.

శంకరపట్నం, మార్చి 15: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసన దీక్ష శనివారం నాలుగో రోజుకు చేరుకున్నది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కనుకుట్ల శ్రీనివాస్ మాదిగ, రాష్ట్ర నాయకులు ఇజం వెంకటస్వామి, రుద్రారం రామచంద్రం, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సెయింట్ జార్జ్ పాఠశాల వార్షికోత్సవం

జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న పాఠశాల చైర్మన్ డా. పి. ఫాతిమారెడ్డి

కొత్తపల్లి, మార్చి 15 : నగరంలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల(సీబీఎస్ఈ)లో శనివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను కొత్తపల్లి మాజీ ఎంపీపీ వాసాల రమేశ్, పాఠశాల చైర్మన్ డా. పి. ఫాతిమారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థులను పోటీ ప్రపంచానికి అనుగుణంగా సిద్ధం చేస్తున్నట్లు పాఠశాల చైర్మన్ పేర్కొన్నారు. కాగా, వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వి. నిరంజన్, భార్గవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

హుజూరాబాద్ టౌన్, మార్చి 15: హుజూరాబాద్ పట్టణంలోని న్యూ కాకతీయ హైస్కూల్‌లో శనివారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హుజూరాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా ఒత్తిడి చేసిన వద్దని చెప్పాలని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై బీ జుమ్ లాల్, పాఠశాల కరస్పాండెంట్ రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గంగాధర, మార్చి 15: కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలలో మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ విజయభాస్కర్.. మత్తు పదార్థాల వల్ల శారీరకంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదురయ్యే ఇబ్బందుల గురించి విద్యార్థులకు వివరించారు.

### సీసీ రోడ్డు ప్రారంభించిన కేంద్ర మంత్రి

గంగాధర, మార్చి 15: ఉప్పరమల్యాలలో గ్రామీణ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. అంతకుముందు గర్శకుర్తి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్, మండలాధ్యక్షుడు పంజాల ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

### రైల్వేగేటు తెరిపించాలని రైతుల వినతి

రామడుగు, మార్చి15 : మండలంలోని దేశరాజ్‌పల్లిలో 24 నుంచి 25వ నంబర్ రైల్వేగేటు వరకు బీటీరోడ్డు వేయించి, 25వ నంబర్ గేటును తెరిపించి పొలాలకు వెళ్లేందుకు సహకారం అందించాలని గ్రామ రైతులు శనివారం జిల్లా కేంద్రంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, రైల్వే ట్రాక్ ఏర్పాటుకు ముందు పొలాలకు వెళ్లేందుకు ఫార్మేషన్ రోడ్డు ఉండేదని, ట్రాక్ వేసిన తర్వాత 24వ గేటు నుంచి 25వ నంబర్ రైల్వేగేటు వరకు బీటీరోడ్డు నిర్మిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చి మరిచారన్నారు. దీంతో పొలాల వద్దకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇక్కడ నాయకులు, రైతులు ఉప్పు రాంకిషన్, ఎల్కపెల్లి లచ్చయ్య, ఐలయ్య, సాగర్, కనకయ్య, మల్లేశం, రాజేశం, సురేశ్, సురేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, అజయ్, శ్రీనివాస్, అనిల్, కొమురయ్య, అచ్చయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎంటర్ ప్రెన్యూర్ షిప్‌పై అవగాహన

తిమ్మాపూర్ రూరల్, మార్చి 15: మండలంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్, సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఎంఎస్ ఎంఈ కరీంనగర్ చాప్టర్ ఆధ్వర్యంలో బీటెక్ మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులకు ఎంటర్ ప్రెన్యూర్ షిప్‌పై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. స్టార్టప్‌లను ఏ విధంగా ప్రారంభించాలి, ఎలా అభివృద్ధి చేయాలో పలు ఉదాహరణలతో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ డి.శ్రీనివాస్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్.శ్రీనివాస్, ఈడీసీ సెల్ కోఆర్డినేటర్ బి.రామ్మోహన్ రెడ్డి, కోకోఆర్డినేటర్ ఎం.భరత్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

### స్మార్ట్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదల చేయాలి

కార్పొరేషన్, మార్చి 15: కరీంనగర్ నగరపాలక సంస్థలో స్మార్ట్ సిటీ కింద చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.30 కోట్ల వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కేంద్రం కూడా నిధులు విడుదల చేయలేదని, దీనివల్ల పనులు పెండింగ్‌లో పడిపోతాయని.. ఈనెల 31తో స్మార్ట్ సిటీ గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.30 కోట్ల నిధులను విడుదల చేస్తే, కేంద్ర ప్రభుత్వం కూడా తన వాటా నిధులను వెంటనే విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు పూర్తి చేయవచ్చని తెలిపారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మార్చి 15: నగరంలో మరమ్మతులు చేపడుతున్నందున ఆదివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్రిస్టియన్ కాలనీ, సవరాన్ స్ట్రీట్, విజయ మోహన్ రెడ్డి హస్పిటల్ ఏరియా, జ్యోతినగర్, కోర్టు వెనుక ప్రాంతం, మోర్ సూపర్ మార్కెట్ ఏరియా

మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు వావిలాలపల్లె, జెండా గద్దె, కెమిస్ట్ భవన్, శివ థియేటర్, వేంకటేశ్వర టెంపుల్ ఏరియా, కోర్టు వెనుక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కొత్తపల్లి, మార్చి 15 : మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన మేరుగు అద్వితక్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కును మాజీ వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్ శనివారం పంపిణీ చేశారు. చెక్కు మంజూరుకు సహకరించిన మాజీ మంత్రి గంగుల కమలాకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలలో భారీ చోరీ

- రూ. 3 లక్షల విలువైన ట్యాబ్‌లను ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభమ్‌ప్రకాశ్, సీఐ లక్ష్మీనారాయణ

మానకొండూర్, మార్చి 15: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో భారీ చోరీ జరిగింది. ప్రధానోపాధ్యాయుడి గది వెంటిలేటర్‌ను పగులకొట్టి లోనికి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తులు రూ. 3లక్షల విలువైన 23 ట్యాబ్‌లను ఎత్తుకెళ్లారు. శనివారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు దొంగతనం జరిగినట్లు తెలుసుకుని మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభమ్‌ప్రకాశ్, మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ, ట్రైనీ ఎస్ఐ క్రాంతికుమార్ పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్ సీఐ స్వర్ణజ్యోతి, క్లూస్ టీం సభ్యులు ఆధారాలు సేకరించారు. హోలీ సందర్భంగా శుక్రవారం పాఠశాలకు సెలవు దినం కావడంతో దొంగతనం జరిగినట్లు అనుమానిస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

### వీధి కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలు

శంకరపట్నం, మార్చి 15: మండలంలోని కేశవపట్నం, ఎరడపల్లి, ఇప్పలపల్లి గ్రామాల్లో శనివారం వీధి కుక్కలు జరిపిన దాడుల్లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్సకు తరలించారు. కాగా, మండలంలో రోజు రోజుకూ కుక్కలు, కోతుల బెడద తీవ్రమవుతున్నదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వీటి కట్టడికి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### వ్యాన్ డ్రైవర్‌పై కేసు

వీణవంక, మార్చి 15: అతివేగంగా నడుపుతూ ప్రమాదానికి కారణమైన డీసీఎం వ్యాన్ డ్రైవర్ బొంగోని శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎలుబాక గ్రామానికి చెందిన ఊట్ల ప్రభుదాస్ (48) తన బైక్‌పై వ్యవసాయ బావి దగ్గర నుంచి గడ్డిమోపు కట్టుకొని ఇంటికి వెళ్తుండగా, గ్రామ శివారులో డీసీఎం వ్యాన్‌ను డ్రైవర్ బొంగోని శ్రీనివాస్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుకొంటూ వచ్చి ప్రభుదాస్ బైక్‌ను ఢీకొట్టాడు. ప్రభుదాస్‌కు కాలు విరిగి తీవ్రగాయాలు కాగా, దవాఖానకు తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రభుదాస్ భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు.

**NOTICE**
IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT SIRCILLA.
O.S.No. 95 of 2018
Between:-
Ummenthula Venkata Harshwardhan Reddy @ Mandadi Venkata Harshwardhan Reddy ...Plaintiff
AND
Ummenthula Venkata Raghuram Reddy & others ...Defendants
To,
1.Ummenthula Venkata Raghuram Reddy s/o late Jagannatha Reddy, aged 58 years, occ: Govt. lecturer is the defendant no.1,
2.Smt. Manjula w/o late U.V. Gunavardhan reddy, aged 47 years, occ: household is the defendant no.2,
3.Ummenthula Venkata Yashowardhan Reddy s/o late U.V. Gunavardhan reddy, major, occ: Student is the defendant No.3.
4.Ummenthula Venkata Kamalakar Reddy s/o late Jagannatha Reddy, aged 45 years, occ: agriculture is the defendant no.4,
All are r/o Ananthapalli village, Boinipalli Mandal of Rajanna Sircilla District.
Take notice that the above named plaintiff filed above suit O.S.No. 95 of 2018 against you all and the above suit is posted on: 02-04-2025 at 10-30 A.M. for your appearance.
So, you all have to appear personally or through advocate on 02-04-2025 at 10-30 A.M. before the above said court in the above suit vide O.S.No. 95 of 2018, failing which above said matter will be decided in your absence as per law.
// By order of the court //
Sd/- KODAM SATYANARAYANA
ADVOCATE, Sircilla.